
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## నా చిన్ననాటి ముచ్చట్లు
## జమున
## (1956 మే – కినిమా మాసపత్రిక నుంచి)



'కళ'లో పైకి రావసినవారికి, దానియందు పుట్టుకతోనే అభిరుచి కలుగుతుందని అనుకుంటున్నా. 'కళ' అంటే నటనో, చదువో లేక సంగీతమో, డాన్సో. దేనినైనా కళే అనాలి. ఏ విద్యలో ఎవరు పైకి రావలసి వుందో, దానియందు వారికి చిన్నతనమునుంచి ఏర్పడుతుంది. నా సంగతి చూడండి: నన్ను మా అమ్మ, నాన్న డాక్టరు చదువు చదివించాలని ఎంతో ఉత్సాహపడ్డారు. మరి నాకు సినిమాలో ప్రాప్తం ఉందాయె – ఏమి చేస్తాను?

నాకు చాలా చిన్నతనం. అంటే బాగా ఊహకూడా తెలియని వయస్సు. బహుశ 4, 5 సంవత్సరాలుండొచ్చు. అప్పుడు జరిగిన సంఘటనలు నాకు యిప్పటికి కూడా బాగా జ్ఞాపకమున్నది. అంత చిన్న వయసులో కూడా, ఏదైనా సినిమా చూసి వస్తే దానిలో వారు చేసిన డాన్సులు, అవీ ఆడడానికి ప్రయత్నించేదాన్ని. రాత్రిళ్ళు గోడమీద నీడ చూస్తూ డాన్సు చేసేదాన్ని. నాకు

అప్పుడే అక్షరాభ్యాసం చేశారు. బడిలో ఓ నమః చదవమంటే ఏదో కూనిరాగం తీస్తూ కూర్చునేదాన్ని. మా టీచర్ రోజూ చూస్తూవుండేది. మొదట్లో ఏం అనలేదు. ఆఖరికి ఒకరోజున కోపం వచ్చి నా చేతులకు, కాళ్ళకు బండకొయ్య వేసింది. యింక ఏడుపు ప్రారంభించాను చూడండి, ఒకటే గోల. స్కూల్‌నుంచి ఆ బండకొయ్యతో సహా ఏడుస్తూ ఇంటికొచ్చి అమ్మతో చెప్పాను. అమ్మ 'పసిపిల్ల ఏదో సరదా కొద్ది పాడినంతమాత్రాన బండకొయ్య వెయ్యాలా?' అంటూ ఛడామడా మాస్టర్లకి నాలుగు తిట్లు వడ్డించి, స్కూలు మానిపించి, యింట్లోనే చదువు చెప్పడం మొదలు పెట్టింది. ఈ విధంగా దుగ్గిరాల వచ్చేవరకు, అమ్మ తెలుగు, లెక్కలు, నాన్న యింగ్లీష్ అక్షరాలు బోధించడంతో జరిగిపోయింది కాలం.

నాకు 8సంవత్సరాలు వచ్చాయి. స్కూల్లో 5వ తరగతి చదువుతున్నాను. సామాన్యంగా పిల్లలు స్కూలు వదులుతూనే, ఆటలాడుకోడానికి పరిగెత్తేవాళ్ళు. కాని, అదేమిటో నేను మాత్రం ఎక్కువగా వారితో చేరలేకపోయేదాన్ని. అంటే అసలు ఆటలకే వెళ్ళకుండాలేను. ఎవరైనా పిలిస్తే ఎప్పుడో ఒకసారి వారితో కలసి ఆడుతుండేదాన్ని. క్రొత్తగా అప్పుడే సంగీతం నేర్చుకుంటున్నా. యిక చూడండి నా సరదా చెప్పతరంగాదు .ఎప్పుడు చూసినా సరిగమలు వల్లెవేస్తూ కూర్చునేదాన్ని. క్లాసులో పాఠాలు చెప్పుతుంటే నేను సంగీత సాధనలో మునిగిపోయేదాన్ని. ఆఖరికి భోజనాలప్పుడుకూడా కంచంలో చేయిపెట్టుకుని నాలుగువ్రేళ్ళతో 'సరిగమ'లు (అప్పటికింకా హార్మోనియం కొనలేదులెండి) వాయిస్తూ వుండేదాన్ని. యిది చూసి అమ్మ, నాన్న, తమ్ముడు ఒకటే నవ్వు. అలంకారాలు మొదలు పెట్టిన తరువాత హార్మోనియం కొన్నారు. దానికి ఎప్పుడూ విరామంలేదు. అప్పటికింకా దుగ్గిరాల్లో సినిమాహాలు రాలేదు. మేము తెనాలి, బెజవాడ వెళ్ళి సినిమాలు చూస్తూ వుండేవాళ్ళం. సినిమా చూసిన దగ్గరనుంచి, ఆట పాటలు నేర్చుకునేవరకు మహా తాపత్రయపడేదాన్ని.

స్కూల్లో డాన్సులు చేయాలి అంటే అందరి కంటే ముందు నేను తయారు. మా మాస్టర్‌గారు ఏదో పాట చెపితే దానికి నా ఊహతో డాన్సు 'కంపోజ్' చేసేదాన్ని. స్కూల్లోగాని, లేక మా దుగ్గిరాలలో ఏ పబ్లిక్ ఫంక్షన్ జరిగినా మొదట ప్రార్ధన, ఆఖరున 'జనగణమన' నేను పాడాల్సిందే. మా గ్రామానికి ఏ మంత్రి వచ్చినా లేక రాజకీయనాయకులు వచ్చినా అన్ని మీటింగులలో నాదే మొదటి కార్యక్రమం. మా ఊరికి ఒకసారి సోషలిస్ట్ పార్టి నాయకుడు జయప్రకాష్ వచ్చినప్పుడు బలే పాటలు పాడాను.

అది 1948 జనవరి 30. ఆ రోజు భారతీయ చరిత్రలో ఒక విషాద దినం. ఆ రోజు గాంధీగారు పోయారంటే, నేను ఒకటే ఏడ్చాను. యిది జరిగిన వారంలోనే ఒకరోజు సాయంత్రం నేను మా యింటి అరుగుమీద కూర్చుని కూనిరాగం తీస్తూవున్నా. ఉన్నట్టుండి గాంధీగారి గురించి ఏదైనా ఒక చిన్న పాట వ్రాద్దామనుకున్నాను. వెంటనే పెన్ను, కాగితం తీసుకుని, ఏదో ఊహకు తోచినట్లు వ్రాశాను.

"దేశ సేవకుడా, భారత యోధుడవై నీవు, దేశానికై నీవు దేహమర్పించావా" అంటూ వ్రాస్తూ, మళ్ళీ కొట్టివేస్తూ, ఈ విధంగా ఎలాగైతేనేం ఆ పాట పుర్తిచేశాను ఆ పాటకు తగినట్లు, దానికి విషాదమైన రాగంకూడా నేనే ట్యూన్ చేసాను.

పాటైతే వ్రాశానుగాని దానికి 'గణయత్రిప్రాస'లు సరిగ్గా వున్నాయో లేవో, ఆ పాట కరెక్టో కాదో యీనాటికీ నాకు తెలియదు. యీ పాట తయారుచేసిన కొద్దిరోజులకు ఒక ఉదయం గుంటూరునుండి మా హెడ్ మాస్టర్ గారికి ఒక టెలిగ్రాము వచ్చింది. అందులో యిలా వుంది"Red Cross Conference Bring Jamuna. D.E.O"

యీ టెలిగ్రాం చూసి మా హెచ్.ఎం గారు మురిసిపోయి వెంటనే నన్ను గుంటూరు తీసుకు వెళ్ళారు .మీటింగుకు చాలా జనం వచ్చారు. నేను అప్పుడు యీ గాంధిగారి పాట పాడాను. ఆ D.E.O గారు నాచే ఆరుసార్లు ఆ పాట పాడించి ఒకే యిదిగా ఏడవడం మొదలుపెట్టారు.

ఒకసారి ఏదో పుస్తకంలో 'సీతాపహరణం' నాటకం చదివాను. అది చదివిన దగ్గరనుంచీ, ఎలాగైనా, ఆ నాటకం వెయ్యాలని ఉబలాటపడ్డాను. ఆఖరికి అమ్మతో చెప్పాను. 'సరే – వేసుకోండి' అంది. అక్కడనుంచి, నటీనటులు ఎవరా అని ఆలోచించాను.

నా ఫ్రెండ్స్‌ను పిలుద్దామని ప్రతివారి యింటికి వెళ్ళి వాళ్ళను అడిగాను. వాళ్ళు 'మా అమ్మ, నాన్న కోప్పడతారు మేము రాము' అన్నారు. నాకు ఏడుపు వచ్చేంత పర్యంతమైంది. ఆకరికి వారి వారి యిళ్ళకు వెళ్ళి వాళ్ళ తల్లిదండ్రులనే అడిగి ఒప్పించాను. ఎలాగైతేనేం మా నాటకం నలుగురితో ముగిసేట్లు ఏర్పాటు అయింది. అందులో పాత్రధారులు: నేను – రాముడు, రావణాసురుడు, మా తమ్ముడు – గిరిధర్, లక్ష్మణుడు, జటాయువు, మరో అమ్మాయి సీత, యింకో అమ్మాయి డాన్స్. ఉన్న వాళ్ళం నలుగురమే కనుక రెండేసి పాత్రలు ఒక్కొక్కరు ధరించాల్సి వచ్చింది. ఒక వారం రోజులు రిహార్సల్స్ జరిపాము. నాటకం యింక రెండు రోజులుందనగా పెద్ద పెద్ద తెల్ల కాగితలమీద, పెద్ద అక్షరాలతో, నటీనటుల పేర్లతో, అంతా రాసి పంచిపెట్టాము. ఏ గోడన చూసినా మేం అంటించిన పేపర్లే. టికెట్ కూడా పెట్టాము. ఎంతో తెలుసా? అర్ధణా. నా ఫ్రెండ్ యింటిదగ్గర నాటకం. వాళ్ళ యింటుముందు బాగా ఖాళీ స్థలం వుంది. ముందు చిన్న వసారా, దాని ప్రక్కన గదివుంది. ఆ గదిలో మా మేకప్‌లు. నేను యీ నాటకానికి ముందు పెద్ద వాళ్ళతో కలిసి "ఢిల్లీ చెలో"లో నటించాను. అప్పటి రంగుల్లో కొన్ని నా దగ్గర వున్నాయి. మా నాటకానికి అవే వాడాము. మా అమ్మ మాకు మేకప్, డ్రెస్సులు వేసింది. అట్టతో కత్తులు, కఠార్లు, కిరీటాలు, బాణాలు తయారుచేసింది. ఎలాగైతేనేం, నాటకం వేసేరోజు రానేవచ్చింది. ఆ పిల్లలు యిద్దరూ భయపడుతున్నారు ఎలా చేస్తామోనని. అదేమిటో, నాకు చిన్నతనం నుంచి స్టేజి భయం వుండేదికాదు.

ఆ పిల్లలకు ధైర్యం చెప్పాను. ఆ రోజు నాటకం రాత్రి 8గంటలకు మొదలు పెట్టాము. జనం చిన్నా, పెద్ద చాలామంది వచ్చారు. ఏదో పిల్లల నాటకం అని ఎవరూ రారేమోనని స్పెషల్‌గా అందరి యిళ్ళకు వెళ్ళి టికెట్స్ యిచ్చి మరీ పిలిచి వచ్చాం. అందువల్ల జనం బాగా వచ్చారు. (టిక్కెట్ కొన్నవారికంటే కొనని వారే ఎక్కువ వచ్చారు) 'పరబ్రహ్మ' ప్రార్ధనతో నాటకం బిగిన్ చేశాము. మొదటి సీనులో సీతా, రాముడు, లక్ష్మణుడు – నేను, తమ్ముడు, ఆ అమ్మాయి వున్నాము. ఆ సీనులో లేడి కనిపించడం, దాన్ని తీసుకురమ్మని సీత కోరడం, రాముడు, లక్ష్మణునితో చెప్పి

వెళ్ళడం. రెండో సీనులో సీత రాముని కేక విని లక్ష్మణుని పంపించడం. తరువాత సీనులో నేను డ్రస్సుమార్చి రావణుని డ్రస్సులో సీతను ఎత్తుకుని పోతాను.

దారిలో రావణుని వేషంలో వున్న నన్ను జటాయువు అడ్డుకుంటాడు. ఆ జటాయువు వేషధారి మా తమ్ముడు. లోపలనుంచి "అరే ఎవడురా నీవు? నా ప్రియమిత్రుడు దశరధుని కోడలనేనా అపహరించుకుని పోవుచున్నావు" అంటూ, ఒక్క దూకు దూకేసరికి నేను హడలిపోయాను. అక్కడినుంచి మా యిద్దరికి యుద్ధం ప్రారంభమైంది. మధ్యలో నా మీసాలు వూడిపోయాయి. నా పది తలలో రెండుతలలు కాస్తా విరిగి ఊరుకున్నై. జనం ఒకటే నవ్వు. ఆ తరువాత సీనులో రామలక్ష్మణులు సీతాన్వేషణకు బయలుదేరుతారు.

దారిలో జటాయువు కనబడి చెపుతుంది. ఆ వేషం, సీత వేసిన అమ్మాయి వేసింది. ఈ విధంగా రెండు వేషాలు ఒక్కొక్కరమే వేస్తూ నటిస్తున్నాము.

'రామాయణంలో పిడకలవేట' అని మనకొక సామెతకూడా వుంది. అది నిజంగానే మా నాటకంలో జరిగింది. అందరం బాగానే నటిస్తున్నాము కాని, ఎవరోమా విరోధులు కొంతమంది ఆడియన్సులోకి పిడకలు విసిరారు. పల్లెటూరు కదండి, ఎక్కడ అంటే అక్కడ పిడకల కుప్పలుంటాయి. వీటిని భద్రంగా మా మీదకు విసిరారు. ఎవరో పెద్దవాళ్ళు వాళ్ళను పట్టుకుని రెండు వడ్డించి వదిలారు. మధ్య మధ్య నా డాన్సులతో డ్రామా జయప్రదంగా ముగిసింది. అందరూ వెళ్ళాక వచ్చిన డబ్బులు లెక్కపెట్టుకున్నాం. రు1-14-0 వచ్చింది. అది రావడమే నాకు చాలా ఆనందం కలిగింది. పిల్లలం కదండీ, తృప్తి ఎక్కువ. ఆ డబ్బుతో మేము నలుగురం గుడికి వెళ్ళి దేవుడికి టెంకాయ కొట్టి, మిగిలిన డబ్బులతో హోటలుకు వెళ్ళి తినేశాం.

2

ఒకరోజు నేను స్కూల్ నుంచి వచ్చి పుస్తకాలు యింట్లో పెట్టి, మా ఇంటి అరుగుమీదనుంచి క్రిందకు దూకి ఆటలకు పారిపోతున్న నన్ను, మా వాకిట్లో నిలబడ్డ జగ్గయ్యగారు గబుక్కున ఎత్తుకుని యింట్లోకి తీసుకువచ్చారు. మరికొందరు మాస్టర్లు కూడా ఆయనవెంట వున్నారు. ఆ వేళ రాత్రి తెనాలి దగ్గర మండూరు అనే గ్రామంలో వాళ్ళు "ఖిల్జీ రాజ్యపతనం" డ్రామా వేస్తారట. అందులో నేను ఒక సీనులో డాన్సు చేయాలట. అందుకని నాన్నతో మాట్లడి నన్ను అప్పటికప్పుడే తెనాలి తీసుకుని వెళ్ళారు. 'నాకేం డాన్సులు రావండీ' అని మొత్తుకుంటున్నా నా గోల ఎవరైనా వింటేనా 'నీకెందుకు అక్కడ మేము నేర్పుతాములే ' అని బుజ్జగించి తీసుకుపోయారు. తెనాలికి రైల్లో వెళ్ళాము.

అక్కడ నాకు బిస్కట్స్, చక్కరకేళీ పళ్ళు, ఏవేవో తినడానికి కొనిచ్చారు. ఆ తరువాత గుర్రపు బండిలో ఎక్కి అక్కడ ఏదో ఒక వూరిదాకా వెళ్ళాము. అక్కడ బండి దిగి, బండి వెనక్కి పంపేశారు. వెంటనే నాకు ఒక సందేహం వచ్చింది. "యిదేమిట్రా బండి పంపేశారు కొంపదీసి నడవాలో, ఏమో" అని. నేను అనుకున్నంత అయింది. అక్కడనుంచి రెండు

మూడు మైళ్ళు నడవాలన్నారు. యిక మళ్ళీ మొదలుపెట్టాను ఏడుపు. నేను నడవలేనని, నేనసలు రానని మొండికెత్తాను. పాపం వాళ్ళు నా ఏడుపు మానిపించాలని, ఈ తెచ్చిన బిస్కెట్స్ అవి, యివి యిచ్చి చాలా అవస్థపడ్డారు. ఏం చేసినా నా మొండిపట్టు మాత్రం విడవలేదు. ఎవరైనాసరే నన్ను ఎత్తుకుంటేగాని, కదలనన్నాను. పాపం ఏం చేస్తారు మొదట వీరభద్రయ్యగారు (ఆయనొక టీచర్) ఎత్తుకుని సగం దూరం వరకు వెళ్ళారు. ఈ సగం దారిలో నానా అల్లరి చేశాను కథలు చెప్పమన్నాను. దించండి కొంచెం దూరం నడుస్తానన్నాను. కొంచెం నడవగానే, ఆ చేలగట్లలో ఏదో ఒక పాము కనబడింది. 'అమ్మో!' అని ఓ కేకవేసి, మళ్ళీ చంకన ఎక్కాను. పాపం వాళ్ళందర్నీ ఇబ్బంది పెడుతూ ఆ ఊరు చేరుకున్నా. అక్కడికి వెళ్ళేటప్పటికి రాత్రి 7.30 అయింది. ఆ రాత్రే డ్రామా. సరే అక్కడ మాకేదో విడిది ఏర్పాటు చేశారు. భోజనాలు అవీ ముగించుకుని హాలుదగ్గరకు వెళ్ళాము. అంత వరకు నాకు ఎవరూ ఏమీ చెప్పలేదు. అక్కడకు వెళ్ళిన తరువాత, ఓ ప్రక్కన మేకప్స్ జరుగుతూ వుంటే, యింకొప్రక్క జగ్గయ్యగారు నాకు డాన్సు నేర్పుతున్నారు బ్యాక్ గ్రౌండ్ సాంగ్ తను పాడతారట, నేను అభినయం చేయాలట. అదంతా అక్కడే నా ఊహకు తగినట్లు అభినయించి చూపించాను. 'ఓ.కే' అన్నారు జగ్గయ్యగారు. నా వందేమాతరంతో డ్రామా బిగిన్ చేశారు .ఆ నాటకంలో జగ్గయ్యగారు పిచ్చివాడిలాగా నటించారు. ఆ నటనా సామర్థ్యం చూసి నేను ఆశ్చర్యపోయి 'ఆ' అంటూ నోరు తెరుచుకుని చూస్తూ కూర్చున్నా సైడ్ కర్టెన్‌లో. నేనుకూడా యింత అద్భుతంగా ఎప్పటికైనా నటించగలనా అని ఆ సమయంలో అనుకున్నాను. తరువాత నా డాన్స్. జగ్గయ్యగారు సైడ్ కర్టెన్‌లోనుంచి పాడుతున్నారు. నేను డాన్స్ చేశాను. డాన్స్ ముగిసింది. ఆ నాట్యనికే ప్రజలు ఎంతో ఆనందపడి 'వన్స్‌మోర్'లు కొట్టారు. 'వన్స్ మోర్' అంటే అర్థం తెలియని నేను ఏమిటో అనుకుని లోపలికి పోబోయాను. జగ్గయ్యగారు రావద్దని సైగచేసి, యిదే డాన్స్ మళ్ళీ చెయ్యమన్నారు. ఈ లోపల నా అమాయకత్వానికి జనం అంతా నవ్వులతో అల్లరి చేశారు. ఎలాగైతేనేం, నా 'జనగణమన'తో డ్రామా జయప్రదంగా ముగిసింది. దుగ్గిరాల వచ్చాక మా హైస్కూల్ టీచర్, పిల్లలు ఎంతో మెచ్చుకున్నారు.

3

ఆ తరువాత డ్రామా 'మా భూమి' ఆ డ్రామాలో హీరో చెల్లెలే హీరోయిన్. ఆ పాత్రకు నన్ను అడిగారు. అందుకు అంగీకరించారు అమ్మా, నాన్న. ఇతరనటులలంతా రైతులు కాబట్టి పగలు తీరిక వుండదు. అందువల్ల రాత్రి 11 గంటలకు 'రిహార్సల్స్' చేసేవారు. రాత్రి నిద్రపోతుంటే నన్ను అలాగే ఎత్తుకుని భుజాన వేసుకుని వెళ్ళేవారు. అక్కడికి వెళ్ళాక నీళ్ళతో ముఖం కడిగి, నాచేత 'రిహార్సల్స్ ' చేయించేవారు 'బుర్రకథ' నాజర్ గారు. నెలరోజులు బాగా రిహార్సల్స్ చేశాము. ఓ నాటి రాత్రి 'మా భూమి' డ్రామా దుగ్గిరాలలో వేశారు. ఆ డ్రామాలో ఓ సీనులో నైజాం పరిపాలనగురించి ఏడుస్తూ అన్నా చెల్లి ఓ పాట పాడతారు. అదేమిటో ఆ సీనులో నేను 'నరక కూపమీ, క్రూర నిరంకుశ, నైజాం పాలనా రైతా ' అంటూ మొదలుపెడుతూనే ఏడుపు వచ్చేసేది. అలాగే పాడ్తూ, పాడ్తూ ఏడుపు ఎక్కువై యింక పాడలేక సగంలోనే ఆపేశేదాన్ని, ఆ

రోజు రాత్రి అలానే జరిగింది. డ్రామా అయిన తరువాత మా ఊరి పెద్దలు ఎంతో మెచ్చుకున్నారు. ఒకరు నాకు 30రుపాయలు ప్రజంట్ కూడా చేశారు. ఈ డ్రామానే మరొకసారి తెనాలిలో కూడా వేశారు అక్కడకూడా నాకో 'మెడల్' ఇచ్చారు. మరొకసారి విజయ 'చక్రపాణి 'గారి స్వగ్రామమైన అయితా నగరంపాడులో వేయడానికి వెళ్ళినప్పుడు నాకు సడన్ గా జ్వరం వచ్చింది. ఆ వేళ నేను నటించలేకపోయాను. ఆ పాత్రకు ప్రక్క ఊరికి వెళ్ళి మరొక అమ్మాయిని తీసుకుని వచ్చారు. జనానికి చాలా నిరాశ కల్గింది. కనీసం ఆ అమ్మాయినైనా చూపించండి అంటూ గోల చేశారట. అందుకని నన్ను ఎత్తుకుని స్టేజిలోకి తీసుకువెళ్ళారు. అందరికి నమస్కారం చేశాను. పాపం వాళ్ళందరూ ఎంతో బాధపడ్డారట. 'చాలా చిన్నపిల్ల, అయినా ఎంత ధైర్యంగా ముద్దుగా నటిస్తుంది' అంటు, తలొకరకంగా మెచ్చుకున్నారట. అదే నా 'లాస్ట్ ' డ్రామా. అంటే అంతటితో బయట ఊళ్ళకు వెళ్ళటం మానివేశాను.

4

మళ్ళీ కొన్ని సంవత్సరాలు దొర్లిపోయాయి. నేను ఎస్.ఎస్.ఎల్.సి చదువుతున్నాను. అప్పటికి కూడా నాకు నాటకాల పిచ్చి వదలలేదు .యింట్లో తీరికవేళల్లో మా యింటి చుట్టుప్రక్కల పిల్లలకు నాకు వచ్చిన పాటలు, డాన్సులు అవి నేర్పించేదాన్ని. ఓ రోజున 'బాల'లో 'విందు' అనే నాటిక చదివాను. దాన్ని పిల్లలచేత వేయించాలనుకున్నాను. మొదట నేనే 'రాధ' వేద్దామనుకున్నాను. కాని నా సైడ్న కృష్ణుడుగా నటించే అమ్మాయి దొరకలేదు. అందువల్ల పిల్లలచేతనే రాధ కృష్ణులు వేయించాను. తమ్ముడు గిరి – దామోదరుడుగా నటించాడు. ఈ డ్రామాలో రాధ, కృష్ణుడు, వారి మిత్రకోటి అందరూ చేరి యమునాతీరంలో విందు చేసుకుంటారు అందరూ యమునా తీరానికి వస్తారు. కాని రాధని మాత్రం వాళ్ళ అమ్మ పోనీయదు. తల్లిని మోసం చేసి రాధ వెళ్ళిపోతుంది. రాధ తల్లిగా నేను నటించాను అందులో పాటలు కూడా ఉన్నాయి. వాటికి నేనే ట్యూన్స్ చేశాను.

రాధవేసిన అమ్మాయికి పాటపాడడం రాదు. అందువల్ల 'ప్లేబాక్' పద్ధతి అనుసరించాను. నేను తెరవెనుక పాడడం, ఆ పిల్ల 'లిప్ మూవ్ మెంట్' యివ్వడం జరిగింది. విందులోకి కావలసిన వెన్న, మీగడ, లడ్డు, జిలేబి యిలాంటివెన్నో తెప్పించి సైడ్ కర్టెన్స్‌లో పెట్టాము. తీరా అవి కావలసిన సీన్ వచ్చినప్పుడు చూస్తే ఏముంది ప్లేట్స్ ఖాళీ. ఎవరో పిల్లలు తినేశారు. మళ్ళీ తెప్పిద్దామంటే టైం లేదు. అందువల్ల ఆ ఖాళీ ప్లేట్స్‌తోనే ఉట్టి ఉట్టి విందు చేశాము. ఈ నాటకం మా హైస్కూల్‌లోనే వేశాము. అమ్మ మేకప్స్, డ్రస్సు వేసింది ఆ తరువాత దుగ్గిరాలలో టూరింగ్ టాకీస్ కట్టారు. నేను ఎక్కువగా సినిమాకి వెళ్ళేదాన్ని. చిన్నప్పటినుండి ప్రతి చిన్న విషయాన్ని కూడా విమర్శిస్తూవుండేదాన్ని.

అలాగే సినిమా చూసి వచ్చి నాగేశ్వరరావుగారు యిలా చేశారంటే, అంజలీదేవిగారు అలా చేశారని యింట్లో అందరితో వాదిస్తూ వుండేదాన్ని. ఆ టాకీస్‌కి 'బాలరాజు' వచ్చినప్పుడు అందులోని రాగమాలిక పాట నేర్చుకోడానికి ఆ పిక్చర్ పన్నెండు సార్లు చూశాను. అంటే నమ్ముతారో, నమ్మరో. అంత అభిరుచి వుండేది. చిన్నతనం నుంచి ఈ 'కళ'

యందు అంత అభిరుచి వున్నందువల్లనో ఏమో, అనుకోకుండా హఠాత్తుగా సినిమా రంగంలోకి విసిరివేయబడ్డాను. ఈ విధంగానే యింజనీర్ కావలసినవాళ్ళు వారు చిన్న తనం నుంచి ఏవో మెకానిక్ పనులు చేస్తూనే ఉంటారు. అలాగే డాక్టర్ కావలసినవాళ్ళు ఎప్పుడూ కప్పలు, చేపలు మొదలైన జంతువులని చంపేటప్పుడు దగ్గర కూర్చుని అవేమిటి, యిదేమిటి అని అడుగుతూవుంటారు. అందుకనే, ఎవరికి ఏ విద్యలో అభిరుచి వుందో వారికి దానిలోనే ప్రోత్సాహమివ్వాలి.

Post your comments